# తిరుపతి - చిత్తూరు




## మద్యం షాపు వద్దే వద్దు - మహిళల నిరసన

తిరుపతిరూరల్, సెప్టెంబర్10 ప్రభాతవార్త:



జనవాసాల మధ్య మద్యం షాపు వద్దే వద్దని గాంధీపురం మహిళలు నిరసన తెలిపారు. వైకుంఠపురం ఆర్చి నుండి మహిళా యూనివర్శిటికి వెళ్ళే మార్గమధ్యలో నూతన మద్యం షాపు ఏర్పాటు చేయరాదని మహిళలు నిరసన గళాన్ని వినిపించారు. చుట్టుపక్కల కుటుంబాలు, విద్యానిలయాలు ఉన్న ప్రాంతంలో మద్యం పెట్టి, అల్లరి పాలు చేయరాదని వేడుకున్నారు. మందుప్రియులు మద్యం సేవించి, మహిళలు, చిన్నపిల్లల పట్ల అసభ్యకరంగా వ్యవహరిస్తున్నారని, ప్రతిరోజు గొడవలు జరుగుతున్నాయని మహిళలు వాపోయారు. గతంలో ఓ బార్ ఉండేదని, అదే ప్రాంతంలో మద్యం షాపు ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. ప్రజాప్రయోజనాల దృష్ట్యా అక్కడ మద్యం పెట్టరాదని మహిళలు డిమాండ్ చేసారు.

## ఇరిగేషన్ ట్యాంకుల మరమ్మతులు, అభివృద్ధిపై సమీక్ష

తిరుపతి కలెక్టరేట్, సెప్టెంబరు 10 ప్రభాతవార్త :



జిల్లాలో 181 నీటి పారుదల ట్యాంకుల పునరుద్ధరణకు నమోదు రూ.515.18 కోట్లతో ఆర్ఆర్ఆర్ దశ-3 ప్రాజెక్టుకు అనుమతుల కోసం ప్రతిపాదనలు పంపుటకు జిల్లా కలెక్టర్ ఇరిగేషన్, కేంద్ర భూగర్భ జల, జిల్లా భూగర్భ జల శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశా రు. బుధవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫెరెన్స్ హాల్‌లో జిల్లా స్థాయి అమలు, పర్యవేక్షణ కమిటీ సమావేశాన్ని కలెక్టర్ వెంకటేశ్వర్ నిర్వహించారు. సమావేశంలో జిల్లా నీటి పారుదల శాఖ ఎస్.ఈ రాధాకృష్ణ, ఎస్ఈ చిత్తూరు వెంకటేశ్వర రాజు, ఎస్.ఈ నెల్లూరు దేశీ నాయక్, తిరుపతి ఈఈ వెంకటేశ్వర్ ప్రసాద్, భూగర్భ జలశాఖ డీడీ శోభన్‌బాబు, కేంద్ర భూగర్భజలశాఖ అధికారులు, శ్రీకాళహస్తి, వెంకటగిరి, గూడూరు ఈఈలు వెంకటశివారెడ్డి, బాబు, బాబురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### చంద్రప్రభవాహనంపై
## ఏకదంతుడి వైభవం



కాణిపాకం, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త:

కాణిపాకం బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం ఉభయదేవేరులతో కలసి విఘ్ననాధుడు చంద్రప్రభవాహనంపై కాణిపాకం పురవీధులలో ఊరేగుతూ భక్తులకు అభయహస్తమిచ్చారు. కార్యక్రమానికి కాణిపాకం, చినకాంపల్లె, వడ్రాంపల్లె, కొత్తపల్లె, చిగరపల్లె, తిరువణంపల్లె, 44 బొమ్మసముద్రం, అగరంపల్లె, పుణ్యసముద్రం, ఎగువ మారేడుపల్లె, సంతపల్లె, ఉత్తరబ్రాహ్మణపల్లె, కారకాంపల్లె, కాణిపాకం పట్నం, పైపల్లె, సిద్దంపల్లె గ్రామాదుల హరిజన వంశస్థులు ఉభయదారులుగా వ్యవహరించారు. వీరు ఉదయం మంగళ వాయిద్యాల నడుమ వరుస ఉభయం తీసుకురాగా అర్చకస్వాములు స్వామివారి మూలవిరాట్‌కు వేదపండితుల మంత్రోచ్చరణ నడుమ ప్రత్యేక అభిషేకాలను, పూజలను నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే ఉభయదారులు అష్టోత్తర శతకలశాలను ఊరేగింపుగా తీసుకువచ్చి ఆలయంలో స్వామివారికి అభిషేకం నిర్వహించారు ఈకార్యక్రమంలో ఈఓ పెంచల కిషోర్, డిప్యూటీ ఈఓ సాగర్‌బాబు,ఏఈఓ రవీంద్రబాబు,సూపరెండెంట్‌లు శ్రీధర్‌బాబు, కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాలాజినాయుడు, చిట్టిబాబులతో పాటు ఆలయ, ఉత్సవ ఉభయదారులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## స్వర్ణ రథంపై విహరించిన విఘ్ననాధుడు



కాణిపాకం దేవస్థానంలో గురువారం రాత్రి సిద్ది బుద్ది సమేతుడైన గణనాధుడు సర్వాలంకృతుడై స్వర్ణరథంపై అధిరోహించి ఆలయ మాడా వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతి నెలా పౌర్ణమి అనంతరం సంకటహర చతుర్థి రోజున రాత్రి స్వామివారికి స్వర్ణరథోత్సవం నిర్వహిస్తుంటారు. ఈమేరకు ప్రధాన ఆలయంలోని అలంకార మండపంలో ఉదయం 10 గంటలకు, సాయంత్రం 5 గంటలకు సంకటహర చతుర్థి వ్రతంను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అలాగే రాత్రి స్వామివారికి స్వర్ణ రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తుల గణేష్ నామస్మరణలు, మంగళ వాయిద్యాల నడుమ ఆలయ మాడా వీధుల్లో స్వామి, అమ్మవార్లను ఘనంగా ఊరేగించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్, ఏఈఓ రవీంద్రబాబు, సూపరెండెంట్‌లు వాసు, కోదండపాణి,టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజినాయుడు, చిట్టిబాబు, అర్చకులు,వేదపండితులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ఇంట్లోకి దూసుకెళ్ళిన ఆటో

### -10మందికి గాయాలు -ఇద్దరి పరిస్థితి విషమం

### ఆసుపత్రిలో ఆర్తనాదాలు



చౌడేపల్లి, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వారితో ఆసుపత్రిలో ఆర్థనాదాలు వినిపించాయి...తీవ్రస్థాయిలో గాయపడ్డ వారు 10మంది ఒక్కసారిగా ఆసుత్రికి రావడంతో తగినంత మంది సిబ్బంది లేక పోవడంతో గాయాలతో క్షతగాత్రులు నొప్పులు తాళలేకు కేకలు వేశారు...పెద్దపంజాని మండలం గౌదమాకులపల్లికి చెందిన వ్యవసాయకూలీలు మండలంలోని శెట్టిపేట పంచాయతీ ఎర్రపల్లికి టమోటా కాయలు కోసేందుకు ఆటోలో వచ్చారు. పనిముగించుకొని అదే ఆటోలో ఇళ్ళకు తిరుగుముఖం పట్టారు. చౌడేపల్లి-పలమనేరు ప్రధాన రహదారి దుర్గసముద్రం షెల్లర్ పక్కనే వున్న ఇంట్లోకి ఆటో దూసుకెళ్ళింది. దీంతో ఇంటి యజమాని శంకరప్ప(50)కు గాయాలు అయ్యాయి. అంతే కాకుండా ఆటోలో ప్రయాణిస్తున్న కూలీలు గౌదమాకుపల్లికి చెందిన ఎ.మంజుల(35), తేజశ్రీ(25), సుబ్బమ్మ(35), మంజుల(28), జ్యోతి(27), లక్ష్మమ్మ(28), హారతి(19), ఆదెమ్మ(45), గుత్తివారిపల్లికి చెందిన ఆటో డ్రైవర్ విశ్వనాథ్‌లకు గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని స్థానికులు ఆటో ద్వారా చౌడేపల్లి ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఆటో డ్రైవర్‌కు మూర్చ రావడం వల్లనే ఈ ప్రమాదం జరిగినట్లు క్షతగాత్రులు తెలిపారు. కాగా ఇక్కడ సిబ్బంది కొరత వుండటంతో రాత్రి ఎఎన్ఎం, స్వీపర్‌లు ఇద్దరే వారికి చికిత్స చేయాల్సి వచ్చింది. దీంతో క్షతగాత్రుల ఆర్ధనాదాలతో ఆసుపత్రి దద్ధరలిల్లింది. గాయపడ్డ వారిలో హారతి, తేజశ్రీల ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఇద్దరినీ మెరుగైన చికిత్స కోసం పలమనేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



ఒకరే చికిత్స అందిస్తున్న దృశ్యం



ఆటో ప్రమాదం గాయపడ్డ క్షతగాత్రులు

### మానవత్వాన్ని చాటుకొన్న తహశీల్దార్ ఎస్ఐలు

: దుర్గసముద్రం వద్ద కూలీలను తరలిస్తున్న ఆటో ఇంట్లోకి దూసుకెళ్ళడంతో క్షతగాత్రులు చిందరవందరగా పడివున్నారు. ఆ సమయంలో అటుగా వెళుతున్న తహశీల్దార్ పార్వతి, సమాచారం తెలుసుకొన్న ఎస్ఐ నాగేశ్వరరావు వెంటనే వారి వద్దకు చేరుకొని 108సకాలంలో రాకపోవడంతో వారిద్దరూ గాయపడ్డ వారిని ఆటోల ద్వారా స్థానిక ఆరోగ్య కేంద్రానికి తరలించే ఏర్పాట్లు చేసారు.

## కార్ డ్రైవర్ దారుణ హత్య

గూడూరు, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త



గూడూరులో యువకుడు దారుణ హత్యకు గురైన సంఘటన చోటు చేసుకుంది. గూడూరు రెండో పట్టణ పోలీసుల వివరాల మేరకు స్థానిక గాంధీ నగర్ సమీపంలోని టిడ్కో గృహాల్లో రహీద్ బాషా అలియాస్ మున్నా(35) అనే యువకుడు కారు డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం స్థానిక గాంధీ నగర్ సమీపంలోని స్మశానం వద్ద రహీద్ భాషా రక్తపు మడుగులో పడి మృతిచెంది వుండటాన్ని స్థానికులు గుర్తించి రెండో పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. గుర్తు తెలియని వ్యక్తులు రహీద్ భాషాను హత్య చేసివుంటారని భావిస్తున్నారు. సమాచారం అందుకున్న డీఎస్పీ గీతాకుమారి సీఐలు శ్రీనివాస్, శేఖరబాబు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. క్లూస్, డాగ్ స్క్వాడ్ రంపించి దర్యాప్తు చేపట్టారు. హత్యకు గల కారణాలపై విచారణ నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఇద్దరు యువకులతో పాటు మరో మహిళపై అనుమానంతో అదుపులో తీసుకొని విచారిస్తున్నారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసుల విచారణలో హత్యకు గల కారణాలు తెలియాల్సి వుంది. ఈ మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించి రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. స్థానిక రెండో పట్టణ పోలీస్టేషన్ ముందుకు హత్యకు గురికాబడిన రహీద్ భాషా బంధువులు ఆందోళన కార్యక్రమం చేపట్టారు. హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దీంతో మృతుడి బంధువులకు, పోలీసులకు మధ్య స్వల్పవాగ్వివాదం చోటు చేసుకుంది. అనంతరం పోలీసులు నచ్చ చెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

### భక్తుల సేవకు
## అహర్నిశలు పనిచేయడానికి సిద్ధం

### -తిరుమల పవిత్రత కాపాడటమే అందరి లక్ష్యం
### -కాలినడకన కొండకు వచ్చిన టిటిడి నూతన ఈఓ సింఘాల్



తిరుమల, సెప్టెంబర్ 10ప్రభాతవార్తప్రతినిధి:



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలు...సూచనలతో తిరుమల పవిత్రత కాపాడటంలో బాధ్యతతో వ్యవహరించి, కలసికట్టుగా నిర్ణయాలు తీసుకుంటామని, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పనకు అహర్నిశలు పనిచేయడానికి సిద్దంగా ఉన్నానని టిటిడి నూతన ఈఓ అనిల్‌కుమార్‌సింఘాల్ స్పష్టం చేశారు. శ్రీవేంకటేశ్వరస్వామి చెంత సేవకుడుగా ...భక్తులకు సేవచేసే భాగ్యం రెండవసారి ఆ దేవుని ఆశీస్సులతోనే లభించిందని, ఇదీ తన పూర్వజన్మసుకృతమని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.కాలినడక మార్గంలో వచ్చేసమయంలో భక్తులు కొందరు కొన్ని సమస్యలు తన దృష్టికి తెచ్చారని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. టిటిడి ఈఓగా రెండవసారి నియమితులైన సింఘాల్ బుధవారం ఉదయం ఆలయంలో బాధ్యతలు చేపట్టారు. రంగనాయకుల మండపంలో బదిలీఅయిన ఈఓ శ్యామలరావునుండి బాధ్యతలు స్వీకరించారు. టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, టిటిడి జెఈఓ వీరబ్రహ్మం సింఘాల్‌తో ప్రమాణస్వీకారం చేయించారు.అనంతరం పలువురు అధికారులు, ఉద్యోగులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. సంవత్సర కాలంలో లడూ ప్రసాదం, అన్నప్ర సాదాల నాణ్యత మెరుగు పడటంతో భక్తులు సం తృప్తి వ్యక్తం చేస్తున్నారని ఈఓ అన్నారు. అంతకు ముందు ఉదయం ఆయన అలపిరి నడకదారిలో కొండకు వచ్చారు.

## మడి బిక్షాలతో ప్రారంభమైన పోలేరమ్మ జాతర

### - భారీగా తరలివచ్చిన భక్తులు

వెంకటగిరి, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త

దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధిగాంచిన వెంకటగిరి గ్రామ శక్తి స్వరూపిణి పోలేరమ్మ జాతర మడిబిక్షాలతో ప్రారంభమైంది. పోలేరమ్మ జాతరకు భారీగా భక్తులు తరలివచ్చారు. జాతరకు అధికారులు పట్టుదల ఏర్పాటు చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ ఎత్తున పోలీసులు పట్టణంలో మోహరించారు. పోలేరమ్మకు టెంకాయ కట్టండి పోతురాజు బిక్షం పెట్టండి అంటూ చిన్నారులు సాంప్రదాయబద్ధంగా మడి బిక్షాలు ఎత్తారు. డి.ఎస్.పి గీతా కుమారి పోలేరమ్మ జాతర ఏర్పాట్లను పరిశీలించారు. అమ్మవారిని కుమ్మరి వీధిలో తయారు చేసి అలంకరణ కోసం దీనిగల వారి వీధిలో అలంకరించారు. 11వ తేదీ గురువారం అమ్మవారి దర్శనం అనంతరం సాయంత్రం నిష్క్రమణ కొరకు ఊరేగింపుగా తీసుకొని వచ్చాడు. పోలేరమ్మ జాతర మతాలకు అతీతంగా జరుగుతుంది. అన్ని మతాలవారు జాతల్లో పాల్గొంటారు. 1700 సంవత్సరంలో వెంకటగిరిలో కలరా రావడంతో అప్పట్లో రాజవంశస్తులు శీతల యాగం చేయించినట్లు పెద్దలు చెబుతున్నారు. కలరా రావడంతో పెద్ద సంఖ్యలో ప్రాణ నష్టం జరిగింది. శీతల యాగం చేయడంతో అప్పట్లో కలర తగ్గి ప్రజలందరూ ఆనందంగా ఉన్నారు. అప్పటినుండి క్రమం తప్పకుండా పోలేరమ్మ జాతర నిర్వహిస్తున్నారు. శీతల యాగం పేరుతో మొదలుపెట్టిన అమ్మవారి పూజా కార్యక్రమం నేడు జాతరగా మారింది. 1992 వ సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి జనార్దన్ రెడ్డి దేవాదాయ శాఖలో పోలేరమ్మ అమ్మవారి జాతరను విలీనం చేయించారు. అనంతరం మూడు సంవత్సరాల క్రితం జాతరను రాష్ట్ర పండుగ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేయించారు. రాష్ట్ర పండుగ కావడంతో పోలేరమ్మ జాతరను వైభవంగా నిర్వహిస్తున్నారు. పోలేరమ్మ అమ్మవారిని పుట్టినిల్లుగా భావించే కుమ్మరి వీధిలో చాకలి కుటుంబీకులు పుట్టపర్తి తెచ్చి తయారు చేస్తారు. అమ్మవారికి ఇక్కడ కళ్ళు పెట్టకుండా ఎలాంటి అలంకరణ చేయకుండా అత్తవారిల్లుగా భావించే చాకలి ఇంటికి అమ్మవారిని జీనుగులు వారి వీధిలో ఉన్న అలంకార మండపానికి తీసుకొని వెళ్తారు. అక్కడ అమ్మవారికి కళ్ళు పెట్టి బంగారు నగలతో అలంకరిస్తారు. అక్కడినుండి లక్షలాది మంది భక్తుల నడుమ రథంపై ఊరేగింపుగా బజారు వీధిలోని పోలేరమ్మ గుడి వద్దకు తీసుకువచ్చిపెట్టి భక్తుల దర్శనార్థం ఉంచుతారు. ఇక్కడ భక్తుల దర్శనార్థం అనంతరం 11వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు పురవీధుల్లో ఊరేగింపుగా నిష్క్రమణకు తీసుకొని వెళ్తారు. లక్షలాది మంది భక్తులు అమ్మవారికి కొబ్బరికాయలు కొట్టి మొక్కలు చేర్చుకుంటారు. పోలేరమ్మ గుడి వద్ద కూడా అమ్మవారిని లక్షలాదిమంది దర్శనం చేసుకుంటారు. జాతర నిర్వహణకు రాజాల అనుమతిని ప్రతి సంవత్సరం నిర్వాహకులు తీసుకుంటారు, సాంప్రదాయం ప్రకారం పోలేరమ్మ అమ్మవారికి రాజ్యాల నివాసం నుండి చీర, సరే సరవళ్ళు తీసుకొని వెళ్తారు. నిర్వహిస్తావైభవంగా జాతర జరగనుంది.








### ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి
## నిరసన వారోత్సవం : ఎపిటిఎఫ్

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త




ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి వారం రోజుల పాటు నిరసన కార్యక్ర మాలు నిర్వహించుటకు తీర్మానించినట్లు బుధవారం ఇక్కడ జరిగిన ఎపిటిఎప్ సమావేశంలో తీర్మానించినట్లు జిల్లా అధ్య క్షులు బి.మురళీ కృష్ణ,కార్యదర్శి బి.బాల సుబ్రమణ్యం తెలిపారు. రాష్ట్రం లోని అన్ని ప్రాంతాల్లో ఈ నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని వారు పిలుపు నిచ్చారు.సమావేశంలో పలు అంశాలకు సంబంధించి సుధీర్ఘంగా చర్చించారు. ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలు చెల్లించుటలో ప్రభుత్వం అణచివేత ధోరణిని ప్రదర్శించటం దారుణమన్నారు. కాబట్టి ఎపిటిఎప్ ఉద్యమ బాట పట్టక తప్పలేదన్నారు. గత ప్రభుత్వం ఉపాధ్యాయులకు అనేక హామీలు ఇచ్చి ఉద్యోగ ఉపాధ్యాయులకు రివర్స్ పిఆర్‌సి అంటూమోసం చేస్తే నేటి కూటమి ప్రభుత్వం కూడా 15 నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీలు అమలు చేయటంలో బకాయిలు చెల్లించటంలో జాప్యం చేస్తుందని ధ్వజమెత్తారు. పెండింగ్ ఉన్న నాలుగు కరువు బత్యాల బకాయిలు ఎప్పుడు విడుదల చేస్తారు? అనేది తెలియజేయటం లేదన్నారు. రాష్ట్ర అడిట్ కమిటి సభ్యులు కే.వెంకట్రాది మాట్లాడుతూ విద్యారంగానికి పాఠశాల వ్యవస్థలో చేపడుతున్న అనేక విద్యార్థి వ్యతిరేక ఉపాధ్యాయ వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ నేపథ్యంలో ఈ నెల 11 నుంచి 17 వరకు రాష్ట్ర వ్యాప్తంగా 'నిరసన వారోత్సవాలు' నిర్వహించబడుతుందని వివరించారు.ఈ మేరకు రాష్ట్ర కమిటి నిర్ణయించిందని ప్రతి మండలంలో అమలు చేయాలన్నారు.ఈ సమావేశంలో శ్రీకాళహస్తి,తొట్టంబేడు, బుచ్చినాయుడు కండ్రిగ, పెళ్ళకూరు,కేవిబిపురం మండలాల ఉపాధ్యాయులు సంఘ నాయకులు ఆర్ గోపాల్, పిడి చంద్రశేఖర్, రామదాసు,రమేష్, ఉదయ్‌కుమార్ సురేష్,శివ, పివిసుబ్రమణ్యంరెడ్డి పెరుమాళ్, మునస్వామి, సుధాకర్, మునిరాజా తదితరులు పాల్గొన్నారు.

## డ్రాప్ అవుట్స్ తగ్గించడమే లక్ష్యంగా విధులు

### ప్రతి 3 నెలలకు ఒకసారి విద్యార్థులకు అనీమియా పరీక్షలు
### - ఎంఇఓలు, హెడ్మాస్టర్ల సమీక్షా సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్



చిత్తూరు, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త:

ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాప్ అవుట్స్ తగ్గించడమే లక్ష్యంగా మండల విద్యాశాఖ అధికారులు, హెడ్మాస్టర్లు, ఉపాధ్యాయులు విధులు నిర్వర్తించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని నూతన సమావేశభవనంలో బుధవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ డ్రాప్ అవుట్స్, అనిమీయా, పరీక్షలు, పౌష్టికాహారం అందించడం తదితర విషయాలపై సమగ్ర శిక్ష ఎపిసి వెంకటరమణారెడ్డితో కలిసి మండల విద్యాశాఖ అధికారులు, హెడ్మాస్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో జులై 2025 నాటికి 4,202 మంది విద్యార్థులను డ్రాప్ అవుట్‌గా గుర్తించగా, ఇప్పటి వరకు 1,997 మంది విద్యార్థులు మాత్రమే వివిధ పాఠశాలల్లో చేరడం జరిగిందన్నారు. పాఠశాల్లో తిరిగి చేరిన డ్రాప్ అవుట్ విద్యార్థుల వివరాలను మండల విద్యాశాఖ అధికారులు పాఠశాలల వారీగా హెడ్మాస్టర్ల ద్వారా ప్రొఫార్మా రూపంలో తయారు చేసి సమర్పించాలని ఆదేశించారు. అలాగే పాఠశాలల్లో ఇంకా చేరని డ్రాప్ అవుట్ విద్యార్థులను మళ్ళీ పాఠశాలలకు పంపేలా వారి తల్లిదండ్రులను కలిసి మాట్లాడాలన్నారు. అలాగే డ్రాప్ అవుట్ విద్యార్థులతో పాటు లాంగ్ అబ్‌సెంట్ విద్యార్థుల వివరాలను సేకరించి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి కారణాలను తెలుసుకోవాలన్నారు. అలాగే జిల్లా నుండి ఇతర ప్రాంతాలకు వలస వెళ్ళిన విద్యార్థుల సమాచారం సేకరించాలన్నారు. ప్రతి మండలంలో ఒక పాఠశాలను మోడల్‌గా తీసుకుని ప్రతి తరగతిలోని విద్యార్థులు తరువాత తరగతికి ఎంత మంది వెళ్తున్నారు, మిగిలిన విద్యార్థులు పాఠశాలకు రాకపోవడానికి గల కారణాలు తెలుసుకుని వారిని పాఠశాలకు వచ్చేలా చేయాలన్నారు. ఈ సమావేశంలో విద్యాశాఖ ఎడి సుకుమార్, మండల విద్యాశాఖ అధికారులు, హెడ్మాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.




## ఐరాల ఇన్‌చార్జి ఎంపీడీఓగా భువనేశ్వరి బాధ్యతల స్వీకరణ



ఐరాల, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త: ఐరాల మండల ఇన్‌చార్జి ఎంపీడీఓగా భువనేశ్వరి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఐరాల ఎంపీడీఓగా పనిచేస్తున్న ధనలక్ష్మి పదోన్నతిపై డ్వామా ఏఈఓగా బదిలీ అయ్యారు. ఈమేరకు ఆమె స్థానంలో ఎంపీడీఓ కార్యాలయంలో ఏఓగా విధులు నిర్వహిస్తున్న భువనేశ్వరిని ఇన్‌చార్జి ఎంపీడీఓగా నియమిస్తూ ఉత్వర్వులు జారీ చేయడంతో ఆమె బుధవారం బాధ్యతలు చేపట్టారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓను కార్యాలయం సిబ్బంది కలసి శుభాకాంక్షలు తెలిపారు.

## వరసిద్దుని సన్నిధిలో ఆలయ పునర్నిర్మాణ దాతలు



**కాణిపాకం, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త:** కాణిపాకం ప్రధాన ఆలయం, బంగారువాకిలి, వెండి వాకిలి నిర్మాణ దాతలు గుత్తికొండ శ్రీనివాస్ దంపతులు బుధవారం సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆయన స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆయనకు వేదమండపంలో స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి ప్రసాదాలను, చిత్రపటాన్ని అందజేశారు. అలాగే శ్రీవీరాంజనే యస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా వారు ప్రత్యేకపూజలు నిర్వహించారు. వారి వెంట ఆలయ సూపరెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంలో ఎస్సీలకు రక్షణ కరువు : ఓబులేసు



**చౌడేపల్లి, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త** కూటమి ప్రభుత్వంలో ఎస్సీలకు రక్షణ కరువైందని వైకాపా ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులేసు అన్నారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రసంగిస్తూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయినప్పటి నుంచి ప్రతి రోజూ ఏదో ఒకచోట దళితులకు అన్యాయం జరుగుతోంద"న్నారు. ముఖ్యంగా మహిళలపై అఘాయిత్యాలు, హత్యలు వంటివి పెరుగుతున్నాయన్నారు. ఇలాంటి సమస్యల పరిష్కారమార్గం కోసం ఈనెల 11న తిరుపతిలో కార్యనిర్వహణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నామనీ, ఉమ్మడి జిల్లాలోని ఎస్సీలందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వైకాపా విద్యార్థి విభాగ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కళ్యాణ్‌భరత్, సర్పంచు శ్రీరామ్ భరత్‌వరుణ్, నియోజకవర్గ ఎస్సీ సెల్‌కార్యదర్శిబ్యాంకురెడ్డెప్ప, మండలకార్యదర్శిగోవిందయ్య, నాయకులు పవన్‌రాయల్, గిరి పాల్గొన్నారు.

## దసరా మహోత్సవానికి రారండి -చల్లాకు ఆహ్వానం

చౌడేపల్లి, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త



శక్తిక్షేత్రం బోయకొండలో ఈనెల 23నుంచి ప్రతిష్టాత్మంగా జరగబోయే అమ్మవారి దసరా మహోత్సవానికి రారండని అధికారులు ఆహ్వానం పలికారు. పుంగనూరు నియోజకవర్గ తేదేపా ఇన్‌ఛార్జ్ చల్లా రామచంద్రారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి(చిట్టి)లను ఆయన నివాసంలో ఆలయ ఇఓ, ఉపకమీషనర్ ఏకాంబరం అమ్మవారి దసరా మహోత్సవానికి ఆహ్వానించారు. సంబంధిత గోడపత్రికలను ఆవిష్కరించారు. ఆలయ ప్రధానార్చకుడు గంగిరెడ్డి, అర్చకులు సుధాకర్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



## కుప్పం టౌన్‌బ్యాంక్ మాజీ ఛైర్మన్ చిన్ని మృతి

**కుప్పం, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త** స్థానిక టౌన్‌బ్యాంక్ మాజీ ఛైర్మన్, సీనియర్ తెదేపా నాయకులు విజి చిని న్న బుధవారం మృతి చెందారు. ఈ యన గతకొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ బెంగళూరు ఆస్ప త్రిలో చికిత్స పొందుతూ అక్కడే మృతి చెందారు. 2012 డిసెంబర్ లో జరిగిన కుప్పం టౌన్ బ్యాంక్ ఎన్నికల్లో ఛైర్మన్‌గా గెలిచిన విజి చిన్ని 2019 వరకు టౌన్‌బ్యాంక్ ఛైర్మన్‌గా కొనసాగారు. ఈయనమృతి పట్ల తెదేపా నేతలు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. గురువారం మధ్యాహ్నం 3గంటలకు అంత్యక్రియలు జరపను న్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

## పంచాయతీల ప్రణాళిక తయారీపై శిక్షణ



**శాంతిపురం, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త** స్థానిక మండల కార్యాలయంలో పంచాయతీల ప్రణాళికల తయారీపై అధికారులు, కార్యదర్శులు, ప్రజాప్రతినిధులకు ఎంపిడిఓ పిఆర్ కుమార్ శిక్షణ తరగతులు నిర్వహించారు. పై 1.0నుంచి పై2.0 వరకు పరివర్తన వ్యాప్తిపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

## రైతులకు మొక్కజొన్న విత్తనాలు పంపిణీ



**రామకుప్పం, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త** మండలంలోని బందార్లపల్లె రైతు సేవా కేంద్రంలో బుధవారం రైతులకు మొక్కజొన్న విత్తనాలను ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు. రైతులకు రాయితీతో విత్తనాలు, ఎరువులు అందిస్తున్న ఘనత సిఎం చంద్రబాబునాయుడుకే దక్కుతుందని నేతలు పేర్కొన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, నేతలు మునిరెడ్డి, శ్రీరాఘవరెడ్డి, పెరుమాళ్, లక్ష్మీనారాయణరెడ్డి, మంజునాథ్ పాల్గొన్నారు.

## మరువ వెళ్తున్న అతినత్తం చెరువు

**రామకుప్పం, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త** మండలంలోని అత్తినత్తం వీరారెడ్డి చెరువు నీటితో నిండి మరువ పారుతోంది. ఇటీవల కురిసిన వర్షాలతో చెరువుకు నీరు చేరడంతో పూర్తిగా నిండింది. దీంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు విశేష పూజలు చేశారు. నీరు నిష్ప్రయోజనం కాకుండా రావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. అలాగే హంద్రీ- నీవా కాలువలో సైతం కృష్ణాజలాలు వర్షపు నీరు సైతం తోడై ప్రవహిస్తోంది.

## సొంత నిధులతో అభివృద్ధి కార్యక్రమం ఎన్ఆర్ఐ అంద్ర మధుబాబు



**పూతలపట్టు, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త** పూతలపట్టు మండలం పోటుకనుమ గ్రామ పంచాయతీ నందు గల పోటుకనుమ చెరువుకు నీళ్ల వచ్చు కాలువ పూడికతీత బుధవారం కార్యక్రమం ప్రారంభించారు. ఈ పనికి అయ్యే సొంత నిధులు మొత్తం పోటుకనుమ గ్రామానికి చెందిన ఆస్ట్రేలియాలో ఎన్ఆర్ఐ అంద్ర మధుబాబు సమకూరుస్తున్నారు. వారికి పోటుకనుమ గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమానికి పేటమిట్ట గ్రామ సర్పంచ్ రాధాకృష్ణ, చెరువు కమిటీ చైర్మన్ యువరాజులు నాయుడు, మాజీ చెరువు కమిటీ చైర్మన్ అంద్ర చంద్రబాబు నాయుడు, మాజీ గ్రామ కమిటీ అధ్యక్షులు ఎల్. నటరాజులు నాయుడు, మాజీ వీఆర్ఓ సెల్ అధ్యక్షులు ఓ. సుబ్బరాజులు, వీఆర్ఓ నాగేంద్ర, లక్ష్మిపతి నాయుడు, ఆంజనేయులు నాయుడు, రాజేంద్ర నాయుడు, వెంగలరాయులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## రైతులకు రుణాలపై అవగాహన సదస్సు



**పాలసముద్రం సెప్టెంబర్ 10 ప్రభాతవార్త:** బాలు సహకార సంఘంలో బుధవారం డిసిసి బ్యాంకు సమావేశం నిర్వహించారు. బ్యాంకు యొక్క కార్య ప్రతి సహకార సంఘ పరిధిలో అవకాశం ఉన్న రైతుల లోన్ మంజూరు చేస్తామని తెలిపారు. ప్రతి రైతుకు లక్ష వరకు ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్ సహకార సంఘం సీఈవో ఎస్ వెంకట ఖాతాదారులు సమావేశంలో పాల్గొన్నారు.

## విద్యార్థులకు సంకల్పపై అవగాహన



**కల్లూరు, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త** చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఐసిడిఎస్ సూపర్వైజర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో విద్యార్థులకు సంకల్పపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ బాలికల రక్షణ కోసం ఉన్న చట్టాలు, తీసుకోవాల్సిన పౌష్టికాహార పాటించవలసిన పరిశుభ్రత, బ్యాడ్ టచ్ గుడ్ టచ్ తదితర అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్.. జి ఎం ఎ. కె. రేష్మ, ఎఎన్ఎం నరసమ్మ, అంగన్వాడి కార్యకర్తలు శ్యామల, ధనలక్ష్మి, అమృత కుమారి, ఆశా కార్యకర్తలు జయలక్ష్మి, జిజియా తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగానికి దుమ్ము కొట్టి గ్రావెల్ క్వారీల చుట్టూ ప్రదక్షణలు

**పాలసముద్రం, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త** పాలసముద్రం మండలంలోని బాలక్రిష్ణాపురం గ్రామ సచివాలయ సర్వేయర్ గా చందు గతంలో జరిగిన బదిలీపై వచ్చారు వచ్చిన మొదటి రోజు మాత్రమే ఆఫీసుకు వెళ్ళి మరుసటి రోజు నుంచి వైద్య సెలవు పెట్టారు. అన్ని రకాలుగా ఆరోగ్యంగా ఉన్న తప్పుడు ధృవపత్రాలతో వైద్య సెలవు పెట్టి విధులకు దుమ్ము కొట్టి ఇదే మండలం వనదుర్గాపురం పంచాయతీలో గ్రావెల్ తోలే వాటితో జతకట్టి తిరుగుతున్నారు. రాష్ట్రంలో ఎంతోమంది నిరుద్యోగులు ఉద్యోగం కోసం ఎదురు చూస్తుంటే ఇలాంటి వాడు ఉద్యోగం ఉన్న విధులకు హాజరుకాకుండా ఉన్నాడు ఇలాంటి వారిపై జిల్లా స్థాయి అధికారులు తగిన చర్యలు తీసుకొని అతని స్థానంలో మరొకరికి అవకాశం కల్పించి పంచాయతీ ప్రజల సమస్యలు తీర్చాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.

## మ్యూటేషన్ చేయకుండా వేధింపులు

– కలెక్టర్‌ను ఆశ్రయించి ఫిర్యాదు చేసిన పెనుమూరు వాసులు



**చిత్తూరుహెల్త్, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త:** తమ పూర్వీకుల నుండి తమకు సంక్రమించిన భూమిని ఆన్‌లైన్‌లో మ్యుటేషన్ చేయకుండా విఆర్ఓ వేధిస్తున్నారని పెనుమూరు మండలం కలవకుంట పంచాయతీ పూనేపల్లికి చెందిన కలందర్, ఆయన తల్లి హసీనాబీలు కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను బుధవారం కలిసి ఫిర్యాదు చేశారు. తన తాతకు పూనేపల్లి గ్రామం 81 మురకంబట్టు రెవెన్యూ దాఖలా సర్వేనెం.296/జిలో 2 ఎకరాల భూమి వుండేదని, తాత మృతి అనంతరం ఆ భూమి తన తండ్రి హుస్సేన్ సాహెబ్ పేరిట బదిలీ అయ్యిందని చెప్పారు. ఈ క్రమంలో తన తండ్రి 24 సంవత్సరాల క్రితం నుండి కన్పించకుండా పోయారని, దీనిపై తాము పోలీసులు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. ఈ పరిస్థితుల్లో 2015 సంవత్సరంలో తన తండ్రి పేరుపై వున్న సర్వేనెంబర్‌ను ఆన్‌లైన్‌లో తొలగించారని, అలాగే ఈ నెంబర్‌ను తన తల్లిపై బదిలీ చేయకుండా అలాగే వదలివేశారన్నారు. దీనిపై తాము ఆర్డీఓ కోర్టును ఆశ్రయించగా ఆర్డీఓ కోర్టు తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందన్నారు. తహసిల్దారు సంబంధిత విఆర్‌ఓను సమస్య పరిష్కరించాలని ఆదేశించినా ఆయన పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తమ భూమిని మ్యుటేషన్ చేయనిచో తమకు ఆత్మహత్యలే శరణ్యమని వారు వాపోయారు.

## 18న వాహనాలు వేలం

**గుడిపాల, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త:** గుడిపాల పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడి సీజ్ అయిన వాహనాలను ఈ నెల 18వ తేదీన వేలం వేయనున్నట్లు ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. ఈ వేలంలో 37 ద్విచక్రవాహనాలు, ఒక స్కార్పియో వాహనం, మారుతి కార్లను వేలం వేస్తున్నామని, వేలం పాటల్లో పాల్గొనే వ్యక్తులు ముందుగా నగదు డిపాజిట్ చేయాల్సి వుంటుందన్నారు. ఈ వేలం నిర్వహణ డిఎస్పీ సాయినాథ్, తహసిల్దారు శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందన్నారు.



## వినాయకుడికి సికె బాబు ప్రత్యేక పూజలు

**చిత్తూరుహెల్త్, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త:** చిత్తూరు వన్నియార్ బ్లాక్‌లో కొలువుతీరిన వినాయకుడికి మాజీ ఎమ్మెల్యే, తెలుగుదేశం నాయకుడు సికె బాబు బుధవారం తొలి హారతి ఇచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ కమిటీ నిర్వాహకులు మాజీ ఎమ్మెల్యే సికె బాబును శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సికె బాబుతో పాటు పెద్ద సంఖ్యలో ఆయన అనుచరులు పాల్గొన్నారు.

## ఏపీడబ్ల్యూజేఎఫ్‌కు సైపుల్లా,శ్రీను



**పుంగనూరు రూరల్, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త** నియోజకవర్గ ఏపిడబ్లుజెఅధ్యక్ష కార్యదర్శులుగా సైపుల్లా, తల్లా శ్రీనివాస్‌లను జిల్లా శాఖ నియమించింది. ఈ నియామకంతో సంఘ కార్యకలాపాలు మరింత బలోపేతం అవుతాయని సభ్యులు అభిప్రాయపడ్డారు. కొత్తగా నియమితులైన అధ్యక్ష కార్యదర్శులను పట్టణ ప్రముఖులు, అధికారులు, ప్రజాప్రతినిధులు అభినందించి, వారి సేవలతో సంఘం మరింత అభివృద్ధి సాధిస్తుందనే నమ్మకం వ్యక్తం చేశారు

## 13న పలమనేరులో జాతీయ లోక్ అదాలత్

**పలమనేరు, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త:** పలమనేరు కోర్టు ప్రాంగణంలో ఈ నెల 13న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి వావిలి ఆది నారాయణ బుధవారం ఒక్రపకటనలో తెలిపారు. లోక్ అదాలత్‌లో కక్షిదారులు రాజీ మార్గమే రాజమార్గంగా భావించి తమ కేసులు పరిష్కరించుకోవాలని సూచించారు. పలమనేరు, గంగవరం, బైరెడ్డిపల్లె, వి.కోట మండలాలకు సంబంధించిన సివిల్ క్రిమినల్ కేసులు, బ్యాంకులకు సంబంధించిన కేసులు, మరియు ఫ్రీ లిటిగేషన్ కేసులు, పరిష్కరించబడిన కేసులను జాతీయ లోక్ అదాలత్ నందు రాజీ మార్గంలో పరిష్కరిస్తామని తెలిపారు.

## కరెన్సీ నోట్లతో వినాయకుడు

**పలమనేరు టౌన్, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త:** పలమనేరు పట్టణంలోని బోయవీధిలో వినాయకుని విగ్రహాన్ని బుధవారం కరెన్సీ నోట్లతో అలంకరించారు. మొత్తం రూ.5.00,216 లను నోట్లతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆగస్టు 27న వినాయక చవితి సందర్భంగా ఈ వీధిలో వినాయకుని విగ్రహం ఏర్పాటు చేశారు. అప్పటి నుండి 14 రోజుల పాటు ధూపదీప నైవేద్యాలతో ప్రతిరోజూ పూజలు చేస్తున్నారు. 17వ రోజు శనివారం అన్నదానం, నిమజ్జనం కార్యక్రమం ఉంటుంది. భారీ ఎత్తున బ్యాండు వాయిద్యాలు, కోలాటములు, భజనలతో వినాయకుని ఊరేగింపుగా తీసుకు వెళ్ళి నిమజ్జనం చేస్తారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ గత 15 ఏళ్ళుగా భారీ ఎత్తున వినాయక చవితి జరుపుకుంటున్నామని తెలిపారు.



## ఓబిసిలకు పెద్దపీట

– సంబరాలు జరుపుకొన్న భాజపా శ్రేణులు

**చిత్తూరురూరల్, సెప్టెంబరు 10 ప్రభాతవార్త:** ఓబిసిలకు పెద్దపీట వేయడం భారతీయ జనతా పార్టీకే సాధ్యమని భాజపా జిల్లా అధ్యక్షుడు జగదీశ్వరనాయుడు, ప్రధాన కార్యదర్శి అట్లూరిశ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం గాంధీ విగ్రహం కూడలి ఎదుట సామాన్య కార్యకర్తగా పనిచేసిన రాధాకృష్ణన్‌ను భారత ఉప రాష్ట్రపతిగా ఎన్నుకోవడంతో బిజెపి శ్రేణులు సంబరాలు జరుపుకొన్నారు. గతంలో మైనారిటీ వర్గంకు చెందిన అబ్దుల్ కలాంను రాష్ట్రపతిగా ఎస్సీ వర్గానికి చెందిన మహిళా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముం, ఓబిసి వర్గంకు చెందిన నరేంద్రమోడి ప్రధానిని చేయడం ఒక్క భారతీయ జనతా పార్టీకే సాధ్యమని పేర్కొన్నారు. అనంతరం మధ్యతరగతి ప్రజలకు ఊరట కలిగించే విధంగా జియస్టీని సరళీకృతం చేసిన ప్రధాని నరేంద్రమోడి, ఆర్థికశాఖ మంత్రి నిర్మలాసీతారామన్ చిత్రపటాలకు పాలాభిషేకం చేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి జగదీశ్వరనాయుడు, అట్లూరిశ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్, అరుణ, జిల్లా కార్యదర్శి సత్యభామ, ఎస్సీకార్పొరేషన్ డైరెక్టర్ బాబు, ఓబిసి మోర్చా రాష్ట్ర కార్యవర్గసభ్యులు సుధాకర్, మైనారిటీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రెహమాన్, మండలాల అధ్యక్షులు షణ్ముగం, లితీష్ కుమార్, రమాదేవి, ప్రసాద్, జిల్లా సీనియర్ నాయకులు రామభద్ర, జిల్లా కార్యవర్గసభ్యులు సత్యనారాయణ, నాయకులు దేవా, మధు, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## అబ్బుపరచిన గణిత అవధానం



**చిత్తూరురూరల్, సెప్టెంబరు 10 ప్రభాతవార్త:** చిత్తూరుపట్టణం, బిఎస్ కన్నన్ పాఠశాల నందు బుధవారం అవధాని అరుణ శివప్రసాద్‌చే నిర్వహించిన 43వ గణిత అవధాన కార్యక్రమం అబ్బురపరచింది. సంధానకర్త ఆంధ్రవిశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు దండాల రాధాక్రిష్ణ, కన్నన్ పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్షులు పూల సుబ్రమణ్యంలు మాట్లాడుతూ విద్యార్థులలో గణితంపై వున్న భయాన్ని పోగొట్టడానికి అవధాన కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కన్నన్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మౌలా, గణిత ఉపన్యాసకులు వసుంధర, స్పందన పౌండేషన్ శ్యామలాదేవి, విశ్రాంత ఆచార్యులు రాధాక్రిష్ణ, మురళీ, విశ్రాంత సబ్ ఇన్‌స్పెక్టర్ మురళీ, చిత్తూరు దాత పార్థసారధినాయుడు, విశ్రాంత ఉపాధ్యాయులు మునిరత్నం, నరసింహులునాయుడు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


## గణనాధునికి విశ్రాంత అదనపు కమీషనర్ పట్టువస్త్రాల బహూకరణ



***కాణిపాకం, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త:*** రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయశాఖ విశ్రాంత అదనపు కమీషనర్, చంద్రప్రభవాహనసేవ ఉభయదారుడు జి.కేశవులు కుటుంబసభ్యులు బుధవారం కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారికి పట్టువస్త్రాలను అందజేశారు. గత కొన్నేళ్ళుగా చంద్రప్రభవాహనసేవ సందర్భంగా ఆయన స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఈమేరకు కేశవులు తన కుటుంబసభ్యులతో కలసి అగరంపల్లె నుండి ఆలయం వరకు పట్టువస్త్రాలను మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకువచ్చి ఆలయ అధికారులకు అందజేశారు. వీటిని స్వామి అమ్మవార్ల ఎదుట వుంచి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ సూపరెండెంట్‌లు శ్రీధర్‌బాబు, కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాలాజినాయుడు, చిట్టిబాబులతో పాటు ఆలయ అధికారులు, అర్చకులు, ఉభయదారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పరపల్లి విఐపి రోడ్డులో మురుగునీరు ప్రవాహం

తిరుపతిరూరల్, సెప్టెంబర్10 ప్రభాతవార్త:





తిరుపతిరూరల్ తుమ్మలగుంట గ్రామ పంచాయతీ పరిధిలోని ఉప్పరపల్లిలో డ్రైనేజ్ పొంగిపోర్లి వి.ఐ.పి రోడ్డుపై ప్రవహిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూరల్లో అపార్టుమెంట్ సంస్కృతి పెరిగిపోవడంతో డ్రైనేజ్ నీరు వెళ్ళటానికి సరైన మార్గం లేనందున రోడ్లపైకి మురుగునీరు వస్తుందని స్థానికులు తెలిపారు. పంచాయతీ అధికారులు అపార్టుమెంట్ నిర్మాణాదారులతో సమావేశం నిర్వహించి, మురుగునీరు ప్రవాహానికి తాత్కాలిక డ్రైనేజ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. వి.ఐ.పి మురుగు నీరు రావడంతో వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగునీరు దుర్గంధాన్ని భరించలేకున్నా ఉన్నామని స్థానికులు వాపోయారు. అధికారులు స్పందించి, మురుగునీరు ప్రవాహానికి సరైన మార్గాన్ని చూపాలని కోరుతున్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## కుప్పం ఎంపిడిఓగా వెంకటేశ్వర్లు బాధ్యతలు



***కుప్పం, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త*** కుప్పం మండల రెగ్యులర్ నూతన ఎంపిడిఓగా వెంకటేశ్వర్లు బుధవార ం బాధ్యతలు చేపట్టారు. ఈయన ఇదివరకు నెల్లూరు జిల్లాలో అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా పనిచేస్తూ పదోన్నతిపై కుప్పం ఎంపిడిఓగా బదిలీ అయ్యారు. ఇప్పటివరకు ఇన్‌చార్జ్ ఎంపిడిఓగా విజయదత్ కొనసాగారు. కాగా బాధ్యతలు చేపట్టిన నూతన ఎంపిడిఓను కార్యాలయ అధికారులు, కార్యదర్శులు ఘనంగా సత్కరించారు. మండల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

## సంక్షోభ సమయాల్లో నర్సులవి నిస్వార్థ సేవలు

– డిఎంహెచ్ఒ డా॥ సుధారాణి

–ఘనంగా పిఇఎస్ నర్సింగ్ కాలేజ్ స్నాతకోత్సవ వేడుకలు !!



***కుప్పం, సెప్టె ంబర్ 10 ప్రభాతవార్త*** కోవిడ్, ఇతర సంక్షోభ సమయాల్లో నర్సులు అందించిన సేవలు నిస్వార్థమైనవని జిల్లా వైద్యఆరోగ్యఅధికారి డా॥ సుధారాణి పేర్కొన్నారు. బుధవారం పిఇఎస్ వైద్య కళాశాల ఆడిటోరియంలో పిఇఎస్ నర్సింగ్ కాలేజ్ 16వ స్నాతకోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా 95మంది విద్యార్థినులకు నర్సింగ్ డిగ్రీలు ప్రదానం చేశారు. ఈసందర్భంగా డిఎంహెచ్ఒ మాట్లాడుతూ నర్సింగ్ విద్యార్థులు తమ వృత్తి నైపుణ్యాన్ని కరుణ, నైతికతతో కలిపి సమాజానికి సేవ చేయాలని సూచించారు. పిఇఎస్ వైద్య కళాశాల డీన్ డా॥ హెచ్ఆర్ కృష్ణారావు మాట్లాడుతూ నర్సింగ్ అనేది ఒక వృత్తి మాత్రమే కాదని సేవ, సహనం, విశిష్టతలతో నిలిచిన పవిత్రమైన పిలుపు అన్నారు. మెడికల్ సూపరింటిండెంట్ డా॥ సుబ్రమణ్యం మాట్లాడుతూ విద్యార్థులు మారుతున్న ఆరోగ్య సవాళ్లు ఎదుర్కొనేలా సిద్ధంగా ఉండాలన్నారు. కాగా ఉత్ ్తమ ఔట్ గోయింగ్ స్టూడెంట్ అవార్డును స్వప్న ప్రియకు అందించారు. కార్యక్రమంలో కాలేజ్ ప్రిన్సిపాల్ అభిరామి, అధ్యాపకులు పాల్గొన్నారు.

## పెన్షనర్ల సంఘం అధ్యక్షుడుగా పి.జి. సెల్వం

కుప్పం, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త



కుప్పం తాలూకా యూనిట్ పెన్షనర్ల సంఘం అధ్యక్షుడుగా పి.జి. సెల్వం, ప్రధాన కార్యదర్శిగా గణేష్ పిళ్లై ఎన్నికయ్యారు. బుధవారం జిల్లా పెన్షనర్ల సంఘం అధ్యక్షులు నాగరాజు అధ్వర ్యంలో స్థానిక ఎన్జీఓ హోంలో ఎన్నికలు నిర్వహించారు. అలాగే కోశాధికారిగా రఘునాథం, సభ్యులుగా ప్రభాకర్, రామ చంద్రన్, మునెప్ప, తిమ్మప్ప, రామచంద్రన్, ఇనాయ తుల్లా, రాజశేఖర్, సత్యనారాయణశెట్టి, మునెప్ప, శంకరయ్యలు ఎన్నికయ్యారు.

## కాంప్యాక్టర్ వాహనంతో కార్మికుల సమయం ఆదా



***కుప్పం, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త*** సిఎం చంద్రబాబునాయుడు కుప్పాన్ని స్వచ్ఛకుప్పంగా మార్చే దిశగా చర్యలు చేపట్టిన విషయం విదితమే. ఇందులో భాగంగా స ్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ ద్వారా కుప్పం మున్సిపాలిటీకి దాదాపు 86లక్షల విలువ చేసే కా ంప్యాక్టర్ వాహనాన్ని మంజూరు చేశారు. ఈ వాహ నాన్ని మంగళవారం నాడు ప్రారంభించగా బుధవారం నుంచి దీన్ని మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు నేతృత్వంలో కార్మికులు వినియోగించడం మొద లుపెట్టారు. పట్టణంలోని 25 వార్డుల పరిధిలో ఇ- ఆటోల ద్వారా సేకరించిన చెత్త చెదారాలను తెచ్చి ఈ కాంప్యాక్టర్ వాహనంలో వేస్తున్నారు. తద్వారా కాంప్యాక్టర్ వాహనం తనలో వేసిన వ్యర్థాలను కుదిస్తోంది. ఇందులోని మెటల్‌ర్యామ్ వ్యర్థాల్లో ఉన్న గాలిని తొలగిస్తుంది. వ్యర్థాల పరిమాణాన్ని తగ్గించడంతో పాటు వాటి ప్రభావాన్ని సైతం తగ్గిస్తోంది. దీంతో వ్యర్థాల భారం మరింత తగ్గే అవకాశం ఉంటోంది. దీంతో మున్సిపల్ కార్మికులకు శ్రమ తగ్గుతోంది.

## టువీలర్‌పై కూలిన మర్రిచెట్టు.. వ్యక్తికి గాయాలు

శాంతిపురం, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త



ఏడోమైలు నుంచి రాళ్లబూదుగూరు వెళ్లే మార్గంలో కాళిగానూరు వద్ద ఓ పురాతన మ ర్రిచెట్టు హఠాత్తుగా కూలింది. దీంతో చెట్టు అటుగా టు వీలర్‌లో వెళ్తున్న రాళ్లబూదుగూరుకు చెందిన వ్యక్తిపై పడడంతో అతనికి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న తహశీల్దార్ శివయ్య, ఎస్సై నరేష్ సంఘటనా స్థలికి చేరుకుని బాధితుడ్ని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మర్రిచెట్టును రోడ్డుపైనుంచి తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేయించారు.

## మల్లెల శివకు ఎల్ఐసి ప్రశంసాపత్రం




**గుడిపాల, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త:** మండల పరిధిలోని 197 రామాపురం గ్రామానికి చెందిన ఎల్ఐసి ఏజెంట్ మల్లెల శివ సంస్థ సిఇఓ సిద్ధార్థ మొహంతి నుండి ప్రశంసాపత్రం అందుకున్నారు. ఎల్ఐసి ఏజెంట్ మల్లెల శివ ఈ ఏడాది జనవరి 20వ తేదీ ఒక్కరోజే దేశ వ్యాప్తంగా 5 లక్షలకు పైగా కొత్త పాలసీలు కట్టించి రికార్డు సృష్టించాడు. ఈ మేరకు ఎల్ఐసి ఏజెంట్ మల్లెల శివ పేరు గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డుకు ఎక్కింది. పెద్ద మొత్తంలో పాలసీలు కట్టించడంలో ఉత్తమ ప్రతిభ కనబరచిన ఎల్ఐసి ఏజెంట్ మల్లెల శివకు ఎల్ఐసి సిఇఓ సిద్ధార్థ మొహంతి ప్రశంసాపత్రంను పంపించారు. ఈ ప్రశంసాపత్రంను సీనియర్ బ్రాంచ్ మేనేజర్ ప్రకాష్ మల్లెల శివకు అందజేశారు. ప్రశంసాపత్రంను అందుకున్న మల్లెల శివ హర్షం వ్యక్తం చేస్తూ చిత్తూరు ఎల్ఐసి బ్రాంచ్, ఎల్ఐసి సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు.

## ట్రాన్స్‌జెండర్లకు ప్రత్యేక కోర్సులు

**చిత్తూరు, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త:** ట్రాన్స్ జెండర్ల కోసం ప్రత్యేకంగా రూపొందిచన పోటీ పరీక్షలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, రాష్ట్ర, జాతీయ స్థాయి, ఐఐటిఇఎస్ కెరీర్ అవకాశాల కోసం సిద్ధం చేయడమే లక్ష్యంగా ప్రత్యేక కోర్సులు అందించబడుతున్నాయని జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ ఎడి వినోద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియేట్ స్థాయికి సంబంధించి అప్టిట్యూడ్, లాజికల్ రీజనింగ్, జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్, పోటీ ఇంగ్లీషు, బేసిక్ కంప్యూటర్ ప్రొఫెషన్సీ, సాఫ్ట్ స్కిల్స్, పబ్లిక్ స్పీకింగ్, ప్రాక్టీస్ టెస్టులు వుంటాయన్నారు. అలాగే డిగ్రీ స్థాయికి సంబంధించి అడ్వాన్స్ అప్టిట్యూట్, న్యూస్ పేపర్ అనాలసిస్, పర్సనాల్టీ డెవలప్‌మెంట్, పోటీ ఇంగ్లీషు(ఎస్ఎ రైటింగ్, బిజినెస్ కమ్యూనికేషన్)లు వుంటాయన్నారు. ఇంటర్మీడియేట్ విద్యార్థులు 18-28 సంవత్సరాల మధ్య వయసు వుండాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు ఐదేళ్ళ వయసు సడలింపు వుంటుందని తెలిపారు. డిగ్రీ విద్యార్థులకు ఏదేని ఒక డిగ్రీ కలిగి 18-35 సంవత్సరాల మధ్య వయస్సు వుండాలని ఆయన తెలిపారు.

## ఆటోడ్రైవర్ల సమస్యల పరిష్కారానికి అక్టోబర్ 6న ఛలో కలెక్టరేట్

**చిత్తూరుహెల్త్, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త:**



జిల్లాలోని ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌తో అక్టోబర్ 6వ తేదీ ఛలో కలెక్టరేట్ కార్యక్రమంను నిర్వహిస్తున్నట్లు ఈ కార్యక్రమానికి జిల్లాలోని ఆటో డ్రైవర్లందరు హాజరు కావాలని జిల్లా ఆటోడ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు మోహన్ పిలుపునిచ్చారు. చిత్తూరు ఎఐటియుసి కార్యాలయంలో బుధవారం జరిగిన ఆటో డ్రైవర్ల యూనియన్ సమావేశానికి జిల్లా ఆటోడ్రైవర్ల యూనియన్ గౌరవ అధ్యక్షులు నాగరాజు, కార్యదర్శి ఎం.విజయకుమార్‌లు మాట్లాడుతూ 70 శాతం మంది యువత చదువుకుని ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగాలు రాకపోవడంతో కుటుంబంను పోషించడానికి ఉపాధి లేక ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నారన్నారు. ఆటోడ్రైవర్లకు ప్రభుత్వం నుండి ఎలాంటి సహాయం లేకపోవడంతో బాధాకరమన్నారు. ఆటోడ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళడానికి అక్టోబర్ 6వ తేదీ ఛలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమానికి జిల్లాలోని ఆటోడ్రైవర్లు అందరు కలసిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎఐటియుసి నాయకులు గోపినాథ్, రమాదేవి, మోహన్, రఘు, వసంతరాయులు తదితరులు పాల్గొన్నారు.

## స్టేట్ అవార్డుకు పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రి పరిశీలన

**పలమనేరు టౌన్, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త:** స్వచ్ఛ ఆంధ్ర అవార్నెస్ స్టేట్ అవార్డుకు పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించారు. బుధవారం కుప్పం మెడికల్ సూపరిండెంట్ పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి విచ్చేసి పారిశుద్యం, వార్డుల స్థితిగతులు, వైద్యుల పనితీరు తెలుసుకున్నారు, ఈ సందర్భంగా సూపరిండెంట్ మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలో మొత్తం 11 ప్రభుత్వ ఆసుపత్రులు ఉండగా ఒక్కొరికి రెండు మూడు ఆసుపత్రులు కేటాయించారని తెలిపారు. ఇందులో భాగంగా పారిశుద్యం, జబ్బులు ఒకరి నుండి మరొకరికి వ్యాపించకుండా నిరోధించడం, రోగులకు ఉన్న సౌకర్యాలు తదితర అంశాలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని దీని ప్రకారం అవార్డుకు ఎంపిక చేస్తారని తెలిపారు. పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ మమతారాణి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

